సింహాద్రి అప్పన్నకు శఠగోపం..!

సింహాచలం దేవస్థానం భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. కొంతమంది తమ వ్యాపారాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంతంలో దేవస్థానంకు చెందిన భూములు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు చోద్యం చూడడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారా.. నెలవారీ మామూళ్లకు అలవాటు పడ్డారా అనేది తేలాల్సి ఉంది. పేదోడు చిన్న పాక వేస్తే వాలిపోయే అధికారులు దేవస్థానం భూములను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నా పట్టించుకోకపోవడంలో మర్మమేమిటో అని పలువురు ప్రశ్నిస్తున్నారు. - విశాఖ విద్య

- ఆలయ భూముల్లో ప్రైవేటు వ్యాపారాలు
- కొండవాలు ప్రాంతాల్లో ఆక్రమణలు
- చోద్యం చూస్తున్న దేవస్థానం అధికారులు

జీవీఎంసీ 90వ వార్డు ఎన్‌ఏడీ సెంటర్‌కు కూతవేటు దూరంలోని ఏపీఎస్‌ఈబీ కాలనీ, సీతారామరాజునగర్ కాలనీలకు ఆనుకొని కొండవాలు ప్రాంతంలో ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. ఈ కాలనీల్లో స్థలాలకు మంచి డిమాండ్ ఉంది. పక్కా నివాసిత గృహాలు, ఆపార్ట్‌మెంట్‌లకు ఆనుకొని ఉన్న దేవస్థానం భూమిలోకి కొంతమంది చొచ్చుకెళ్లి దర్జాగా వాపారాలు చేస్తున్నారు. ఆక్రమణదారులకు కూటమి నేతలు అండదండలు ఉన్నాయనే ప్రచారం ఉంది. వారిసేవలో తరలిస్తున్న దేవస్థానం అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని పరిసర ప్రాంత ప్రజలు అంటున్నారు.


90వ వార్డు కొండవాలు ప్రాంతంలోని దేవస్థానం భూముల్లో హెచ్చరికబోర్డు

యూజర్ చార్జీలు చెల్లించేదెవరికో ..

ఎన్‌ఏడీ సెంటర్‌లోని ఎన్‌ఎస్‌టీఎల్ మొదలు కొని లక్ష్మీనగర్ మీదుగా సింహాచలం ఆలయ రోడ్‌కు వెళ్లే వరకు ఓ వైపున దేవస్థానం భూములు ఉన్నాయి. కొండవాలు ఏరియాలో కొంతమంది విలువైన స్థలాన్ని ఆక్రమిస్తున్నారు. దేవస్థానానికి యూజర్ చార్జీలు చెల్లిస్తున్నామని ఇక్కడి వ్యాపారస్తులు చెబుతున్నారు. దీనికి అనుమతులు ఎవరు ఇచ్చారు..? వ్యాపారాలు చేస్తున్నవారు చెల్లిస్తున్న యూజర్ చార్జీలు ఎక్కడికి వెళ్తున్నాయనేది దేవస్థానం ఉన్నతాధికారులు పరిశీలన చేస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.


దేవస్థానంలో భూముల్లో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన షెడ్డు

పర్యవేక్షణ సిబ్బంది ఎక్కడ?

కొండవాలు ఏరియాలోని దేవస్థానం భూముల పరిరక్షణకు ప్రత్యేకంగా సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేశారు. వీరు వారికి కేటాయించిన ఏరియాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని దేవస్థానం అధికారులు తెలియజేయాలి. కొంతమంది దేవస్థానం భూముల్లోకి చొరబడి ప్రైవేటు వ్యాపారాలు చేస్తున్నా పర్యవేక్షణ సిబ్బందికి కనిపించకపోవడం గమనార్హం. వ్యాపారుల నుంచి నెలవారీ వసూళ్లకు పాల్పడుతూ అప్పన్న ఆదాయానికి గండికొడుతున్నారు. 'తిలా పాపం తలా పిడికెడు' అన్న చందాన దేవస్థానం అధికారులకు సైతం వాటాలు ముట్టడంతోనే ఆక్రమణలకు అడ్డుకట్టలేకుండా పోతుందని స్థానికులు అంటున్నారు.

పేదోళ్లంటే అలుసా..

దేవస్థానానికి సంబంధించిన భూములను ఎవరూ ఆక్రమించడానికి వీల్లేదు. అయితే గూడు లేని రోజువారీ కూలీలు, నిరుపేదలు కొండవాలు ప్రాంతంలో తాత్కాలిక గూడు ఏర్పాటు చేసుకుంటే క్షణాల్లో వాలిపోయి ఉన్నఫలంగా వాటిని దేవస్థానం సిబ్బంది తొలగించేస్తున్నారు. కానీ, ఏళ్ల తరబడి దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నవారి విషయంలో వెనుకడుగు వేస్తుండటాన్ని ప్రజానీకం ఆక్షేపిస్తున్నారు. పేదోళ్లపై ప్రతాపం చూపించే అధికారులు వ్యాపారుల దగ్గర పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దేవస్థానం అధికారులుఆక్రమణలపై దృష్టి సారించి అప్పన్న ఆస్తులను కాపాడాలని భక్తులు కోరుతున్నారు.


దేవస్థానం భూమిలో లారీ పార్కింగ్

బడ్డీ తొలగింపు


శ్మశానవాటిక ముందు ఫుట్‌పాత్‌పై పెట్టిన బడ్డీని తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మల్కాపురం: శ్మశాన వాటిక ఎదురుగా అనధికారికంగా వెలసిన బడ్డీని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఎట్టకేలకు తొలగించారు. 60వ వార్డు కోరమాండల్ ఎదురుగా గల హిందూ శ్మశానవాటిక ముందు ఫుట్‌పాత్‌పై స్థానిక టీడీపీ నేత అండతో బడ్డీ ఏర్పాటు చేశారు. దీంతో శ్మశానానికి వచ్చే వారితో పాటు పాదచారులు,వాకర్స్ అసౌకర్యానికి గురయ్యేవారు. సమస్యను వార్డు కార్పొరేటర్ పి.వి. సురేష్ దృష్టిలో పెట్టారు. దీనిపై స్పందించిన ఆయన నగర మేయర్‌కు సమస్యను వివరించారు. మేయర్ స్పందించి బడ్డీ తొలగించాలని ఆదేశించారు. దీంతో సిబ్బంది బడ్డీ తొలగించడానికి సిద్ధమయ్యారు. ఈ తరుణంలో ఎమ్మెల్యే ఎమ్మెల్యే గణబాబు పీఏ ఫోన్ చేసి బడ్డీ తొలగించవద్దని సూచించారు.సిబ్బంది వెళ్లిపోయారు. ఈ సమస్యపై 'సాక్షి' దిన పత్రికలో శనివారం శ్మశానవాటిక ముందు దుకాణం అని ప్రచురితమైన వార్తకు స్పందించారు. అలాగే కార్పొరేటర్ పి.వి.సురేష్ కూడా కార్పొరేటర్లు,జీవీఎంసీ ఉన్నతాధికారులు ఉన్న వాట్సప్ గ్రూప్‌లో సమస్యను పోస్టు చేశారు.దీంతో ఎట్టకేలకు దుకాణాన్ని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. సమస్య పరిష్కారం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దాం


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు,చిన్నారులు

మల్కాపురం: స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకుందామని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈ.పి.ఎస్.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా శనివారం మల్కాపురం శాఖా గ్రంథాలయంలో శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు స్వచ్ఛత వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. చిన్నారులతో కలిసి స్థానిక నాయకుడు మజ్జి సోమేష్, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి వై.అనసూయాదేవి,గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, ప్రముఖ చిత్రకారుడు ద్వారపూడి శ్రీనివాస మనోహర్ తదితరులు పరిసరాలను శుభ్రం చేశారు.

ఎన్‌ఏడీ ఆర్‌వోబీ పనుల పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న విశ్వనాథన్

విశాఖ విద్య: ఎన్‌ఏడీ వద్ద ఫ్లై ఓవర్‌కు అనుసంధానంగా నిర్మిస్తున్న ఆర్‌వోబీ పనులను శనివారం వీఎంఆర్‌డీఏ కమిషనర్ కే ఎస్ విశ్వనాథన్ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌గా ప్రతీక్ తన్వర్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా ఢిల్లీకు చెందిన ప్రతీక్ తన్వర్ నియమితులైనట్టు తెలిసింది. స్టీల్‌ప్లాంట్ బోర్డులో ఫంక్షనల్ డైరెక్టర్లతో పాటు కొంతమంది ఇండిపెండెంట్ డైరెక్టర్లు కూడా ఉంటారు. ఇండిపెండెంట్ డైరెక్టర్లను కేంద్ర ప్రభుత్వం తమకు నచ్చిన వారిని నియమిస్తుంది. ఇందులో భాగంగా ఢిల్లీకి చెందిన న్యాయవాది ప్రతీక్‌ను నియమించినట్టు సమాచారం. కేంద్ర ఉక్కుమంత్రిత్వశాఖ త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది.

భెల్‌లో ఆక్టోపస్ మాక్ డ్రిల్


ఆక్టోపస్ సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న సౌత్ ఏసీపీ త్రినాథ్

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)లో ఆక్టోపస్ సిబ్బంది శనివారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద కార్యాకలపాలు, దుష్ట శక్తుల నుంచి భారీ సంస్థలను ఎలా కాపాడుకోవాలో విన్యాసాల ద్వారా అవగాహన కల్పించారు. దీని ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలు రక్షణ వలయంలో ఉన్నాయన్న సంకేతాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడమే లక్ష్యమన్నారు. ఆక్టోపస్ అధికారి రాజారెడ్డి ఆధ్వర్యంలో విన్యాసాలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, గాజువాక సీఐ పార్థసారథి సంస్థకు చేరుకుని ఆక్టోపస్ సిబ్బందిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం


అప్పన్నకు యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

అందరి సహకారంతో స్వచ్ఛాంధ్ర


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే గణబాబు కోరారు. జీవీఎంసీ 91వ వార్డు శ్రీరామ్‌నగర్, 92వ వార్డు నార్త్ రైల్వే క్వార్టర్స్‌లో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మన పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే ఆరోగ్యాలు బాగుంటాయన్నారు. రానున్న వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు, జోనల్ కమిషనర్ హేమావతి, 91, 92 శానటరీ ఇన్‌స్పెక్టర్లు, మూర్తి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

- జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోపాలపట్నం బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ప్రాంగణంలో చెత్తాచెదారాలు తొలగించారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ కె. జగీశ్వరరావు, ఎస్‌డీఈ భగవాన్, జేటీవో కృష్ణ, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విశాఖ విద్య: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కార్పొరేటర్ బొమ్మిడి రమణ కోరారు. 90వ వార్డులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వడదెబ్బకు గురికాకుండా స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బంగారు నాయుడు, నరవ పైడి రాజు తదితరులు పాల్గొన్నారు.


బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ప్రాంగణంలో వ్యర్థాలను తొలగిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు


మాట్లాడుతున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

62వ వార్డులో..

సింధియా: వార్డులో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం ఆధ్వర్యంలో స్వచ్ఛతకు పలు ప్రణాళికలు రూపొందించి వాటిని సక్రమంగా అమలు చేస్తున్నామన్నారు. శనివారం జరిగిన కార్యక్రమంలో లక్ష్మణరావు మాట్లాడుతూ సూర్యరశ్మి నుండి రక్షణ పొందేందుకు కాటన్ దుస్తులు ధరించాలని, టోపీలు, గొడుగులు వెంట తీసుకొని వెళ్లాలని సూచించారు. కొబ్బరినీళ్లు, గ్లూకోజ్, ఓఆర్ఎస్ తదితర పానీయాలతో పాటు అధికంగా మంచినీటిని సేవించాలన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో త్రినాథపురం గ్రామకమిటీ నాయకులు నీలంరాజు, ఎస్.రాము, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

మొక్కలను ప్రేమించండి



గోపాలపట్నం బంక్ వద్ద మొక్క నాటిన భూషణం మాస్టారు

గోపాలపట్నం: మొక్కలను ప్రేమిద్దాం... అవి మనకు నీడతో పాటు ప్రాణవాయువును ఇస్తాయన్నారు పర్యావరణ ప్రేమికుడు భూషణం మాస్టారు. గోపాలపట్నం బంక్ సెంటర్‌లో శనివారం ఒక మొక్క నాటారు. దాని సంరక్షణ బాధ్యతను అక్కడే చెప్పులు కుట్టుకునే వ్యక్తికి అప్పగించారు. దీన్ని సాకితే నీకు నీడనిస్తుందని వివరించాడు. మొక్క బాధ్యత తీసుకుంటానని.. ప్రతీ రోజు నీరు పోసి సాకుతానని సంతోషంగా ఒప్పుకున్నట్లు ఆయన తెలిపారు.

తాగునీటికి అవస్థలు



63వ వార్డులో ట్యాంకర్లు వద్ద తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవ, జయేంద్రకాలనీ, కాకరలోవ ప్రాంతాల్లో శనివారం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. చింతల్లోవ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతుండడం వల్ల తాగునీరు ప్రవహించే పైప్ లైను పాడైపోయింది. దీంతో మూడు రోజులుగా ప్రజలు తాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కార్పొరేటర్ గల్లా చిన్నా ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని అధికారులకు సూచించడంతో శనివారం ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేశారు. ఆదివారం నుంచి తాగునీటి సరఫరా యధావిధిగా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

సామాజిక భవనం ప్రారంభం

మల్కాపురం: కోరమాండల్ సంస్థ సౌజన్యంతో జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం వద్ద రూ. 34 లక్షలతో నిర్మించిన సామాజికభవనంతో పాటు శ్రీరామ్‌నగర్‌లో రూ.7లక్షలతో నిర్మించిన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను శనివారం ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కోరమాండల్ సంస్థ ప్రతినిధులను అభినందించారు. కోరమాండల్ యూనిట్ హెడ్ జ్ఞానసుందరం, సంస్థ డీజీఎం (హెచ్‌ఆర్)రెడ్డిపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎస్‌ఆర్ నిధుల నుంచి పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో ఇప్పటికే సుమారు కోటి రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు.


సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ గణబాబు,కోరమాండల్ అధికారులు

కార్యక్రమంలో కోరమాండల్ అధికారులు,పిలకవానిపాలెం,శ్రీరామ్‌నగర్ గ్రామ పెద్దలతో పాటునాయకులు అంగ దుర్గాప్రశాంతి,కోరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాఖ విద్య: ఉపాధి అవకావాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని మురళీకృష్ణ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ నిరంజన్ సాయి అన్నారు. మ్యాజిక్ బస్ రిలయన్స్ ఆధ్వర్యంలో ఎన్‌ఏడీ దరి బాజీ జంక్షన్‌లోని మురళీ కృష్ణ డిగ్రీకాలేజీలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 315 మంది విద్యార్థులు హాజరుకాగా ప్రతిభ చూపిన 185 మందిని వివిధ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ సాయి మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ చదువులతోనే పోటీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మ్యాజిక్‌బస్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ అప్పలరాజు, కాలేజీ ప్రిన్సిపాల్ బి. శ్యామ్‌వల్లభ రావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గంగాధర్ పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

సమ్మెతో స్టీల్ యాజమాన్యాన్ని ప్రతిఘటిస్తాం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సమ్మెతో ప్రతిఘటిస్తామని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు. ఈ నెల 20న కార్మిక సమ్మె నేపథ్యంలో శనివారం ఉక్కు పరిపాలన భవనం కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి డి. ఆదినారాయణ మాట్లాడుతూ యాజమాన్యం వైఖరికి వ్యతిరేకంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ మూడు నెలలుగా లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించలేదన్నారు. కార్పొరేటర్ బి. గంగారావు మాట్లాడుతూ ప్యాకేజీ పేరిట స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం మోసం చేస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కె.ఎస్.ఎన్.రావు, పి.వి. రమణమూర్తి, రామస్వామి, గణపతిరెడ్డి, డి.వి. రమణారెడ్డి, రామ్‌కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.



ధర్నాలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఘనంగా ఎర్నిమాంబ తొలేళ్ల సంబరం


ఎర్నిమాంబ అమ్మవారి ఘటాలతో భక్తులు


ఉత్సవ విగ్రహంతో ఆలయ సిబ్బంది, నాయకులు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో గల ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరాన్ని ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఆలయం వద్ద సుమారు 260 ఎర్నిమాంబ అమ్మవారి ఘటాలతో భక్తులు కాలినడన బయలుదేరారు. కొబ్బరితోట, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట, రైల్వేస్టేషన్, కాన్వెంట్ కూడలి మీదుగా జ్ఞానాపురంలోని పుట్టబంగారం వద్దకు అమ్మవారి ఘటాలను చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ తొలేళ్ల సంబరాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంపై మాలధారులు నడిచి మొక్కులు చెల్లించుకున్నారు. హార్బర్, కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆదివారం ప్రధాన జాతర నిర్వహించనున్నట్లు ఈవో సురేష్‌బాబా తెలిపారు.

యోగా.. ఉత్సాహంగా..


మెగా యోగా కార్యక్రమంలో బాలబాలికలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ నెల 5 నుంచి ఉక్కు స్టేడియంలో నిర్వహించిన శిబిరంలో సుమారు వెయ్యి మంది బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. 5 నుంచి 20 ఏళ్లలోపు బాలబాలికలకు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, రోలర్ స్కేటింగ్, వాలీబాల్, యోగా అంశాలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో యోగా గురువు కనకారావు నేతృత్వంలో మెగా యోగా శిబిరం నిర్వహించారు.విద్యార్థులు ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో టౌన్ అడ్మిన్ విభాగాధిపతి వై. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

రోడ్డెక్కిన మురుగు

రోడ్డుపై మురుగు నీటి ప్రవాహంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్‌లో సచివాలయాల ఎదురుగా కాల్వలో చెత్త అడ్డుపడడంతో మురుగు నీరు రోడ్డుపైకి వచ్చేస్తోంది. కాల్వలో మంచినీటి పైప్ లైన్ అడ్డంగా ఉండడంతో పాటు కాల్వను శుభ్రం చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు చెబుతున్నారు. కాల్వ ఎప్పటికప్పుడు పొంగడంతో దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. నెలలో నాలుగైదు సార్లు ఇలా మురుగు రోడ్డుపైకి వస్తుందని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. -గోపాలపట్నం

ఫోకస్





పందుల స్వైరవిహారం

జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్ జంక్షన్‌లో వ్యర్థాలు పేరుకుపోయాయి. రోడ్డు పక్కన చెత్తాచెదారం రోజుల తరబడి ఉండడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పందులు స్వైర విహారం చేయడంతో అనారోగ్యం పాలవుతున్నామని చెబుతున్నారు. పారిశుధ్య సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడతో రోడ్డు మార్గం మొత్తం దుర్గరంగా మారింది. పందులు చెత్తను చెల్లాచెదురు చేస్తూ పరిసరాలను పాడుచేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చెత్త తొలగించడంతో పాటు పందులను కట్టడి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. - సింధియా

